సూర్య నేటి దినపత్రిక
www.suryaa.com
18వ వసంతంలోకి..
www.suryaa.com



EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
బుధవారం
30 అక్టోబర్ 2024
పేజీలు: 02

పాఠకులు,మిత్రులు, శ్రేయోభిలాషులకు
దీపావళి శుభాకాంక్షలు



# మార్కెట్‌లో కనిపించని ధనత్రయోదశి ఉత్సాహం



కస్టమర్లు లేక వెలవెలబోయిన నగల దుకాణాలు బంగారం, వెండి దుకాణాల్లో ఈసారి ధనత్రయోదశి సందడి పెద్దగా కనిపించలేదు. మంగళవారం ఉదయం ఆరంభం నుంచే నీరసంగా మొదలైన వ్యాపారం.. రాత్రిదాకా అంతంతమాత్రంగానే సాగింది. దీంతో అధిక ధరలు కొనుగోళ్లకు అడ్డంకిగా మారాయన్న అభిప్రాయాలు నగల వర్తకుల నుంచి వినిపించాయి. ఈ క్రమంలోనే గత ఏడాదితో పోల్చితే ఈసారి సేల్స్ 10 శాతం పడిపోవచ్చని అంటున్నారు. నిరుడు ధనత్రయోదశికి ఉన్న ధరతో ప్రస్తుత ధరను చూస్తే 33 శాతం ఎగిసినట్టు గుర్తుచేస్తున్నారు. నాడు (నవంబర్ 11, 2023) తులం 24 క్యారెట్ గోల్డ్ రూ.61,200 పలికింది. ఇప్పుడు రూ.81,400గా ఉన్నది. ఏడాది కాలంలో రూ.20,200 పెరుగుదల చోటుచేసుకున్నది. కాగా, ఏటా దీపావళికి రెండు రోజుల ముందు వచ్చే ఈ ధనత్రయోదశి రోజున బంగారం, వెండి, వజ్రాలు, ఇతరత్రా విలువైన లోహాలు, ఆభరణాలు కొనుగోలు చేస్తే శుభం కలుగుతుందని అందరి (ముఖ్యంగా హిందువులు) నమ్మకం. అందుకే జ్యుయెల్లరీ మార్కెట్‌లో ఈ రోజుకు చాలా ప్రత్యేకత ఉంటూ వస్తున్నది.బంగారం ధరలు మళ్లీ పెరిగాయి. సోమవారం రికార్డు స్థాయిల నుంచి తగ్గిన గోల్డ్ రేట్లు.. మంగళవారం తిరిగి పుంజుకున్నాయి. దీంతో ఢిల్లీలో 10 గ్రాముల 24 క్యారెట్ పుత్తడి విలువ రూ.300 పెరిగి రూ.81,400 పలికింది. ఇది శనివారం నమోదైన ఆల్‌టైమ్ హై రూ.81,500కు సమీప స్థాయి కావడం గమనార్హం. మరోవైపు వెండి ధర కిలో రూ.200 ఎగిసి రూ.99,700 వద్ద ఆగింది. పారిశ్రామిక, నాణేల తయారీదారుల నుంచి వచ్చిన డిమాండ్ కలిసొచ్చిందంటూ వ్యాపార సరళిని మార్కెట్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. కాగా, నిరుడు ధనత్రయోదశి రోజున కిలో వెండి రూ.74,000 పలికింది. దీంతో ఏడాదిలో రేట్లు 35 శాతం పెరిగినైట్టెంది. ఇక హైదరాబాద్‌లో 24 క్యారెట్ తులం ధర రూ.80,450గా, 22 క్యారెట్ రూ.73,750గా ఉన్నాయి. రూ.650, 600 చొప్పన పెరుగుదల కనిపించింది.



## రేపు తిరుమలలో వీఐపీ దర్శనాలు రద్దు

తిరుమల శ్రీవారి ఆలయంలో రేపు దీపావళి ఆస్థానం సందర్భంగా వీఐపీ దర్శనాలను టీటీడీ రద్దు చేసింది. ప్రోటోకాల్ ప్రముఖులకు మాత్రమే దర్శనం కల్పించనుంది. ఇటు తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. టోకెన్లు లేని భక్తులకు సర్వదర్శనానికి 6 గంటల సమయం పడుతోంది. నిన్న శ్రీవారిని 59,140 మంది దర్శించుకోగా 16,937 మంది తలనీలాలు సమర్పించారు. హుండీ ఆదాయం రూ.3.31 కోట్లు లభించింది.

## టెన్త్‌లో పాస్ మార్కులు 10 వారికి మాత్రమే..

వచ్చే ఏడాది మార్చి-ఏప్రిల్‌లో జరిగే టెన్త్ పరీక్షలపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రత్యేక అవసరాలు కలిగిన(మెంటల్ బిహేవియర్, ఇంటెలెక్చువల్ డిజేబిలిటీ) విద్యార్థులకు పాస్ మార్కులను 10(గతంలో 35)గా నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ దేవానందరెడ్డి ఉత్తర్వులిచ్చారు. అన్ని సబ్జెక్టుల్లోనూ 10 మార్కులు వస్తే చాలని పేర్కొన్నారు.

## స్మృతి మంధాన అరుదైన రికార్డు

న్యూజిలాండ్ మహిళలతో మూడో వన్డేలో సెంచరీతో అదరగొట్టిన భారత ఓపెనర్ స్మృతి మంధాన ఓ అరుదైన రికార్డును అందుకున్నారు. ఇండియా తరఫున వన్డేల్లో అత్యధిక సెంచరీలు(8) చేసిన ప్లేయర్‌గా నిలిచారు. ఆ తర్వాతి స్థానాల్లో మిథాలీ రాజ్(7), హర్మన్ ప్రీత్ కౌర్(6) ఉన్నారు. ఓవరాల్‌గా వన్డేల్లో లానింగ్(ఆసీస్) 15 సెంచరీలతో అగ్రస్థానంలో కొనసాగుతున్నారు. కాగా 3 వన్డేల సిరీస్‌ను భారత్ 2-1తో కైవసం చేసుకున్న విషయం తెలిసిందే.

## రాష్ట్రంలో 16,347 ఉద్యోగాలు.. 6న నోటిఫికేషన్!

రాష్ట్రంలో 16,347 పోస్టులతో నవంబర్ 6న మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 3-4 నెలల్లో నియామక ప్రక్రియ పూర్తిచేసి, వచ్చే విద్యాసంవత్సరానికి పోస్టింగులు ఇచ్చేలా ప్రణాళిక సిద్ధం చేసింది. ఇప్పటికే జిల్లాల వారీగా ఖాళీలు, రోస్టర్ పాయింట్లు, సమాంతర రిజర్వేషన్ల వివరాలను డీఈఓల నుంచి సేకరించింది.



## ఢిల్లీలో అధ్వానస్థితికి గాలి నాణ్యత.. 300కి పడిపోయిన ఏక్యూఐ

ఢిల్లీలో గాలి నాణ్యత అధ్వాన స్థితికి చేరింది. బుధవారం ఉదయం 7 గంటల ప్రాంతంలో ఢిల్లీలో ఏక్యూఐ 300కి పడిపోయింది. అనేక ప్రాంతాల్లో 300కి పైనే నమోదైనట్లు కాలుష్య నియంత్రణ మండలి తెలిపింది. ఆనంద్ విహార్‌లో 351, బవానాలో 319, అశోక్ విహార్ ప్రాంతంలో 351, వాజీపూర్‌లో 327గా ఏక్యూఐ నమోదైంది. ఇక అయా నగర్‌లో 290, ఐటీవో వద్ద 284గా ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ నమోదైనట్లు సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ తెలిపింది. గాలి నాణ్యత పడిపోవడంతో ఢిల్లీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అనేక ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా శ్వాసకోశ సంబంధిత సమస్యలతో సతమతమవుతున్నారు. ఇదిలా ఉండగా.. కాళింది కుంజ్‌లోని యమునా నదిలో కాలుష్యం తీవ్ర స్థాయిలో పెరిగిపోయింది. నదిలో విషపూరితమైన నురగ తేలుతూ కనిపిస్తోంది. ఈ మధ్య ఢిల్లీలో వాయు కాలుష్యం ఆందోళనకరంగా మారుతున్న విషయం తెలిసిందే. గత కొన్ని రోజుల నుంచి దేశరాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం తీవ్రమవుతోంది. పొరుగు రాష్ట్రాల్లో వ్యర్థాలను తగులబెడుతుండడంతో ఢిల్లీలో కాలుష్యం పెరిగింది. దీనికి తోడు పొగమంచు కూడా రాజధాని ప్రాంతాన్ని ఆవహిస్తోంది. దీంతో నగరంలో రోజురోజుకూ ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ అధ్వానస్థితికి చేరుకుంటున్నట్లు కాలుష్య నియంత్రణ మండలి పేర్కొంది.

## స్పెయిన్‌లో వరద బీభత్సం..

### కొట్టుకుపోయిన వందలాది కార్లు



స్పెయిన్‌లో ఆకస్మిక వరదలు బీభత్సం సృష్టిస్తున్నాయి. దీని కారణంగా పలువురు మృతి చెందగా అనేకమంది ఆచూకీ తెలియరాలేదని అధికారులు పేర్కొన్నారు. మరోవైపు వరదల్లో వందలాది కార్లు కొట్టుకుపోతున్నాయి. ఇందుకు సంబంధించిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. 'స్పెయిన్‌లోని వాలెన్సియాలో ఆకస్మిక వరదలు సంభవించాయి. దీని కారణంగా ఎంతోమంది మృతిచెందారు. ఇప్పటికే వారి మృతదేహాలు కనుగొన్నాం. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి' అని ప్రభుత్వ అధికారి కార్లోస్ మజోన్ పేర్కొన్నారు. మరోవైపు దక్షిణ స్పెయిన్‌లోనూ భారీ వర్షాలు కురిశాయి. దీంతో అక్కడి వీధులు బురద నీటితో నిండిపోయాయి. వరదల కారణంగా పలువురు తప్పిపోయినట్లు అధికార ప్రతినిధి పేర్కొన్నారు. తప్పిపోయిన వారి కోసం డ్రోన్ల సహాయంతో గాలింపు చర్యలు చేపట్టినట్లు వెల్లడించారు. ఈనేపథ్యంలో స్పెయిన్ కేంద్రం ఓ సంక్షోభ కమిటీని ఏర్పాటుచేసింది. వారు మంగళవారం సమావేశమై పరిస్థితులపై చర్చించారు. 'తప్పిపోయిన వ్యక్తులు, తుపాను కారణంగా సంభవించిన నష్టం గురించి ఆందోళన చెందుతున్నా. అధికారుల సలహాలను ప్రజలు అనుసరించాలి. అనవసరమైన ప్రయాణాలకు దూరంగా ఉండండి' అని స్పెయిన్ ప్రధాని పెడ్రో శాంచెజ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఇదిలాఉండగా.. రాష్ట్ర వాతావరణ సంస్థ వాలెన్సియా ప్రాంతంలో రెడ్ అలర్ట్ ప్రకటించింది.

## ఏపీలో ఓటర్లు 4.14 కోట్లు




రాష్ట్రంలో ప్రస్తుతం ఓటర్ల సంఖ్య 4,14,20,395కు చేరింది. ఇందులో పురుషులు 2,03,47,738, మహిళలు 2,10,69,803, థర్డ్ జెండర్ 3,394 మంది ఉన్నారు. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం ముసాయిదా జాబితాను విడుదల చేసింది. జనవరి నుంచి కొత్తగా 10,82,841 మంది ఓటర్లు చేరారు. నవంబర్ 9, 10, 23, 24 తేదీల్లో అభ్యంతరాలు స్వీకరించి, వచ్చే జనవరి 6న తుది జాబితాను ఈసీ ప్రచురించనుంది.



## కొండా సురేఖపై హీరో నాగార్జున వేసిన పిటిషన్ వాయిదా

వచ్చే నెల 13కు వాయిదా వేసిన నాంపల్లి స్పెషల్ కోర్టు మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలపై హీరో నాగార్జున, మాజీ మంత్రి కేటీఆర్ వేర్వేరుగా దాఖలు చేసిన పరువునష్టం దావా పిటిషన్లపై నాంపల్లి ప్రత్యేక కోర్టులో బుధవారం విచారణ జరిగింది. కొండా సురేఖ తరఫున న్యాయవాది గురుమిత్‌సింగ్ ఈ విచారణకు హాజరయ్యారు. రెండు పిటిషన్లపై విచారణను న్యాయస్థానం నవంబర్ 13కు వాయిదా వేసింది. గత విచారణలో కేటీఆర్, దాసోజు శ్రవణ్ స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేసిన కోర్టు.. ఈరోజు మిగిలిన ముగ్గురు సాక్షులు తుల ఉమ, బాల్క సుమన్, సత్యవతి రాథోడ్ స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేయనుంది. మరోవైపు హీరో అక్కినేని నాగార్జున వేసిన పిటిషన్‌పై మంత్రి కొండా సురేఖ కౌంటర్ దాఖలు చేయనున్నారు. ఈ కేసులో నాగార్జునతో పాటు సాక్షుల స్టేట్‌మెంట్‌ను న్యాయస్థానం రికార్డు చేయనుంది.

## నేడు మోకిల పీఎస్‌కు రాజ్ పాకాల



ఫామ్ హౌస్ పార్టీ కేసులో కేటీఆర్ బావమరిది రాజ్ పాకాల నేడు హైదరాబాద్‌లోని మోకిల పీఎస్‌కు వెళ్లనున్నారు. హైకోర్టు ఇచ్చిన రెండు రోజుల గడువు నిన్నటితో ముగిసింది. దీంతో ఆయన న్యాయవాదితో కలిసి మధ్యాహ్నం విచారణకు హాజరవుతారని సమాచారం.

# వైఎస్ విజయమ్మ లేఖకు వైసీపీ కౌంటర్



వైఎస్సార్ కుటుంబంలో ఏర్పడిన ఆస్తుల వివాదంపై లేఖాస్త్రాలు కొనసాగుతున్నాయి. తాజాగా వైఎస్ విజయలక్ష్మి లేఖకు కౌంటర్‌గా వైసీపీ బహిరంగ లేఖ విడుదల చేసింది. కుట్రపూరితంగా షేర్ల బదిలీ వాస్తవమే కదా? అని ప్రశ్నించింది. చంద్రబాబుకు మేలు చేసేలా షర్మిల వ్యవహరించడం ధర్మమేనా? అని వైసీపీ లేఖలో పేర్కొంది. వైసీపీ రాసిన లేఖను యథాతథంగా దిగువన చూడండి...

1. దివంగత మహానేత వైయస్సార్‌గారి భార్యగా, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి శ్రీ వైయస్. జగన్మోహన్‌రెడ్డిగారి తల్లిగా శ్రీమతి విజయమ్మగారిని అమితంగా గౌరవిస్తాం. వైయస్సార్‌గారి కుటుంబ వ్యవహారంపై విజయమ్మగారు బహిరంగ లేఖ విడుదలచేసిన నేపథ్యంలో కొన్ని అంశాలను ఆమె ముందుకు, ప్రజల ముందుకు తీసుకువస్తున్నాం.

2. విజయమ్మగారు రాసిన లేఖలో, శ్రీ జగన్‌గారిని లీగల్‌గా ఇబ్బందిపెట్టేందుకు, తద్వారా బెయిల్ రద్దుకు జరిగిన కుట్ర వ్యవహారాన్ని కనీసం ప్రస్తావించకపోవడం ప్రజలను పక్కదోవపట్టించడమే. సరస్వతీ కంపెనీ విషయంలో ఈడీ అటాచ్‌మెంట్ ఉన్నప్పటికీ, తెలంగాణ హైకోర్టు స్టేటస్-కో ఆదేశాలు ఉన్నప్పటికీ, యాజమాన్యబదిలీ జరిగేలా క్రయవిక్రయాలు చేయకూడదని, అందుకే అటాచ్‌మెంట్లో ఉందనే విషయం అందరికీ తెలిసినప్పటికీ, సరస్వతీ విషయంలో ఎలాంటి మార్పులు, చేర్పులు చేయవద్దని సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జిల సహా న్యాయసలహాలు ఉన్నప్పటికీ, తప్పు అని తెలిసినప్పటికీ మోసపూరితంగా, కుట్రపూరితంగా షేర్లు బదిలీచేసిన మాట వాస్తమే కదా? షర్మిలగారి భావోద్వేగాలకు, ఒత్తిళ్లకు గురై శ్రీ జగన్‌గారికి న్యాయపరంగా, చట్టపరంగా చిక్కులు తెచ్చే ఈ పనికి, తెలిసి కూడా విజయమ్మగారు ఆమోదించి సంతకం పెట్టడం నిజమేకదా? విజయమ్మగారి లేఖలో ఆ అంశాన్ని పూర్తిగా విస్మరించడం ప్రజలను, వైయస్సార్‌గారి అభిమానులను పక్కదోవపట్టించడమే కదా?

3. 2024 ఎన్నికల్లో శ్రీ జగన్ ఒక్కరే ఒకవైపున ఉంటే, అటువైపు చంద్రబాబుగారి నేతృత్వంలో రాజకీయ ప్రత్యర్థులు జట్టుకడితే, మరికొన్ని గంటల్లో ఎన్నికల ప్రచారం ముగుస్తుందనగా, దివంగత మహానేత వైయస్సార్‌గారిని ఎఫ్ఐఆర్‌లో పెట్టిన, తన కుమారుడ్ని అన్యాయంగా 16నెలలు జైల్లోపెట్టిన కాంగ్రెస్‌కు ఓటు వేయండంటూ, వైయస్సార్‌సీపీని ఇబ్బందిపడుతూ వీడియో విడుదలచేసి విజయమ్మగారు షర్మిలగారివైపు ఉన్నారనే విషయాన్ని చాలా స్పష్టంగాచెప్పారు. దివంగత మహానేత, వైయస్సార్‌గారి రాజకీయ ప్రత్యర్థులకు, వైయస్సార్ కుటుంబంపై నిరంతరం కుట్రలు పన్నే చంద్రబాబుకు రాజకీయంగా మేలుచేసేలా ఇలా వ్యవహరించడం ధర్మమేనా? రాజకీయాలు పక్కనపెడితే ఒక తల్లిగా ఆరోజు విజయమ్మగారు మద్దతు సంగతి దేవుడెరుగు, కనీసం తటస్థవైఖరిని మరిచిపోయి, పక్షపాతం వహించిన వైనంచూసి వైయస్సార్ అభిమానులు తీవ్రంగా కలతచెందారు, బాధపడ్డారు.

4. ఇప్పుడు షర్మిలగారి భావోద్వేగాలు, ఒత్తిళ్ల ప్రభావంతో, సరస్వతీ కంపెనీ వ్యవహారంలో న్యాయపరంగా ఇబ్బందులు వచ్చి, స్వయంగా ఆమె కుమారుడి బెయిల్ రద్దు కుట్రకు దారితీస్తుందని తెలిసికూడా మోసపూరితంగా, షేర్ల సర్టిఫికెట్లు పోయాయని చెప్పి, ఒరిజనల్ షేర్ సర్టిఫికెట్ లేకుండా, శ్రీ జగన్‌గారి సంతకాలు లేకుండా, ఎవ్వరికీ తెలియకుండా షేర్లను బదిలీచేసి, షర్మిలగారితోనే విజయమ్మగారు ఉన్నారని మరోసారి స్పష్టంగా చెప్పారు.

5. అంతేకాకుండా శ్రీ జగన్‌గారికి, షర్మిలగారు వ్యక్తిగతంగా రాసిన ఉత్తరం టీడీపీ సోషల్ మీడియా అక్కౌంట్‌లో ప్రత్యక్షం కావడం, విజయమ్మగారు కూడా సంతకం చేసిన ఆ ఉత్తరాన్ని టీడీపీవారు విడుదలచేయడం, పలు సందర్భాల్లో శ్రీ జగన్‌గారిపై షర్మిలగారు అనుచిత వ్యాఖ్యలు చేసినా, జగన్‌గారు ఏనాడూ తన చెల్లెలను ఉద్దేశించి ఒక్కమాట కూడా మాట్లాడకపోయినా విజయమ్మగారు ఏరోజూ సరిదిద్దే కార్యక్రమం చేయకపోవడం, ఆమె వైఖరిని ప్రశ్నిస్తున్నాయి.

6. కోర్టుల్లో ఉన్న కేసులను ప్రతికూల రీతిలో ప్రభావితం చేసేలా షర్మిలగారి ప్రవర్తన, చర్యలు ఉన్నా, ఒకవైపు ఆస్తులపై హక్కులు కోరుతూ, మరోవైపు అందుకు విరుద్ధంగా ఆమె వ్యవహరించినా, తప్పుడు కేసులపై శ్రీ జగన్‌గారు చేస్తున్న పోరాటం, వాటి ఫలితాలు ఎలా ఉంటాయన్నదానిపై ఆమెకు ఎలాంటి ఆందోళన లేనట్లు ప్రవర్తించినా, శ్రీ జగన్ గారిని రాజకీయంగా, ఆర్థికంగా దెబ్బతీసేందుకు, బలహీనుడిని చేసేందుకు అనుగుణంగా ఆమె నడుచుకున్నా, షర్మిలగారు వేసిన ప్రతి అడుగు కూడా ప్రత్యర్థులకు లబ్ధి చేకూర్చేలానే ఉన్నా, మూడు నాలుగేళ్లుగా ఇంత జరుగుతున్నా ఓపికతో, సహనంతో, మౌనంగా ఆ బాధను శ్రీ జగన్‌గారు అనుభవించారు. ఇలాంటి పరిస్థితుల్లో అసలు బాధితులు ఎవరు? ఒక తల్లిగా శ్రీమతి విజయమ్మగారి బాసట ఎవరికి ఉండాలి? అన్న బలమైన ప్రశ్న ఇప్పుడు తలెత్తుతోంది.

7. రాజకీయాల పేరిట తెలంగాణలో అడుగుపెట్టిన దగ్గరనుంచి అవకాశం ఉన్నప్పుడల్లా శ్రీ జగన్‌గారిని షర్మిలగారు ఇబ్బందిపెడుతూనే ఉన్నారు. అక్కడ నుంచి ఒక్కసారిగా మాయమై, రాజశేఖరరెడ్డిగారిని ఎఫ్ఐఆర్‌లోపెట్టిన పార్టీకి, అన్నను 16 నెలలు జైల్లో అక్రమంగా నిర్బంధించిన పార్టీకి ఈ రాష్ట్ర అధ్యక్షురాలిగా వచ్చారు. పోనీ రాజకీయాలు ఇంతే అనుకున్నా, ప్రజాస్వామ్య విమర్శల పరిధిని దాటి, ఆజన్మాంత శత్రువు మాదిరిగా శ్రీ జగన్‌గారిని షర్మిలగారు అనరాని మాటలు అన్నారు. ఎన్నికల సమయంలో శ్రీ జగన్‌గారిపై దాడి జరిగితే ఎగతాళి చేసి, అమానవీయంగా మాట్లాడింది షర్మిలగారు కాదా? వీటన్నింటినీ శ్రీ జగన్‌గారు ఓపికతో భరించారు. మరి రచ్చకెక్కింది ఎవరు? పరువుతీసింది ఎవరు? నిజమైన బాధితులు ఎవరు? శ్రీ జగన్‌గారు బాధితులు కాదంటారా?

8. కుమార్తె ప్రభావం, ఒత్తిళ్లు కారణంగా విజయమ్మగారు న్యాయ అన్యాయాల విచక్షణను విస్మరించారు. కుమార్తెను వెనకేసుకువచ్చే ధోరణివల్ల, సరస్వతీ కంపెనీల విషయంలో తనవంతు పాత్ర పోషిస్తూ చట్టవ్యతిరేక పనులకు తోడ్పడ్డారు. తన కుమారుడు ఎదుర్కోబోయే చట్టపరమైన సంక్లిష్ట పరిస్థితులేంటో తెలిసి కూడా విజయమ్మగారు దాన్ని విస్మరించారు. ప్రస్తుత పరిస్థితులకు ప్రధాన కారణం ఇదే.

9. వైయస్సార్‌గారు జీవించి ఉన్నపుడే జగన్‌గారూ కంపెనీలు నడిపారు, అలాగే షర్మిలగారు తన కంపెనీలను తాను నడిపారు. ఉమ్మడి ఆస్తులు అయితే మరి ఒకరి కంపెనీల్లో ఒకరికి వాటాలు ఎందుకు లేవు? వైయస్సార్‌గారి మనోభావాలు, ఆజ్ఞ వేరేలా ఉంటే ఇలా ఎందుకు జరిగి ఉంటుంది? తనకుమార్తెకు వైయస్సార్‌గారు తన పూర్వీకుల ఆస్తులతో పాటు, తాను సంపాదించిన ఆస్తులను ఇచ్చాడు. శ్రీ జగన్‌గారి ఆస్తులు తనవికాదు కాబట్టి, ఇవ్వలేదు. ఎందుకంటే ఈ శ్రీ జగన్‌గారి స్వార్జితం కాబట్టి.

10. వైయస్సార్‌గారు బ్రతికి ఉండగానే షర్మిలగారికి పెళ్లై 10 ఏళ్లు, వైయస్సార్‌గారు మరణించి మరో 10 ఏళ్లు గడిచిన తర్వాత, అంటే 20 ఏళ్లు తర్వాత జగన్‌గారు తన స్వార్జిత ఆస్తుల్లో కొన్నింటిని చెల్లెలిపై ప్రేమానురాగాలకొద్దీ ఇవ్వడానికి నిర్ణయించుకున్నారు. కోర్టుకేసుల నేపథ్యంలో 2019లో ఆమెకు మంచి చేస్తూ ఒక ఎంఓయూ రాసి ఇచ్చారు. అంతేకాకుండా గడచిన పదేళ్లకాలంలో దాదాపు రూ.200 కోట్లు పైచిలుకు వివిధకాలాల్లో షర్మిలగారు శ్రీ జగన్‌గారి ద్వారా పొందినా తన సోదరుడిపట్ల ఆమె ఏమాత్రం కృతజ్ఞత చూపలేదు.

11. తన స్వార్జితంతో సంపాదించిన ఆస్తులను, లవ్ అండ్ అఫెక్షన్‌తో షర్మిలకు ఇస్తున్నాని శ్రీ జగన్‌గారు ఎంఓయూ రాస్తే,. దానిపై విజయమ్మగారూ, షర్మిలగారూ ఇద్దరూ సంతకాలు చేశారు. అంటే దీని అర్థం జగన్‌గారి స్వార్జిత ఆస్తుల్లో హక్కులేదని ఆరోజు వారు మనస్ఫూర్తిగా అంగీకరించినట్టేగా? మరి ఇప్పుడు ఉమ్మడి ఆస్తులు అంటూ లేఖలో పేర్కొనడం ప్రజలను తప్పుదోవ పట్టించనట్టే. నిజంగా ఉమ్మడి ఆస్తులు అయితే, వాటిని పంచుకునే పద్ధతి ఇలా ఎంఓయూల రూపంలో ఉండదని, చట్టరీత్యా హక్కుగా వస్తుందని ప్రతికుటుంబానికి తెలుసు.

12. ఇంత యాగీ చేస్తున్న షర్మిలగారు ఈ సంస్థల్లో ఒక్క రూపాయి అయినా పెట్టుబడి పెట్టారా? ఒక్కరోజైనా కంపెనీ కార్యకలాపాల్లో పాలుపంచుకున్నారా? కంపెనీలకున్న రూ.1400 కోట్ల అప్పుల్లో తన వాటా కింద వ్యక్తిగత పూచీకత్తు ఇస్తూ సంతకం పెట్టారా? లేక రూ.500 కోట్ల నష్టాల్లో అయినా ఆమె పాత్ర ఆమె పోషించారా? ఈ కంపెనీలకు సంబంధించిన కష్టాల్లో, చిక్కుల్లో, కోర్టు కేసుల్లో ఏరోజైనా తానుగా బాధ్యత తీసుకున్నారా?

13. పైగా ఈ కంపెనీల మీద, జగన్‌గారి మీద ఎవరైతే కేసులు పెట్టారో వారికి రాజకీయ ప్రయోజనం కల్పించేలా వారిని బలపరుస్తూ, కంపెనీలను బలహీనపరుస్తూ సాగుతున్న నడవడిక, వైఖరి చూస్తే ఈ కంపెనీల్లో వాటాలు ఉన్నాయని ఎవరికైనా అనిపిస్తుందా? నిజంగా వాటాలు ఉంటే, ఇలా చేస్తారా? ఇలా శ్రీ జగన్‌గారిని, ఆయన కంపెనీలను ఇబ్బందులు పాలు చేస్తారా?

14. ఇప్పుడు వైయస్సార్ కుటుంబ వ్యవహారం కోర్టులో ఉంది. ఇరువురి వాదనలు ప్రజలముందు ఉన్నాయి. ఒకటే వాదనను వేర్వేరు వ్యక్తులు, వేర్వేరు స్థాయిగల వ్యక్తులు, వివిధ సందర్భాల్లో, వివిధ పద్ధతుల్లో వినిపించడం వల్ల పదేపదే బురదజల్లడం అవుతుంది తప్ప, దీనివల్ల పెద్దగా ఫలితం ఉండదు. ఇప్పుడు ఎవరు చేసింది.



## అభిమాని హత్య కేసు.. నటుడు దర్శన్‌కు మధ్యంతర బెయిల్

అభిమాని హత్య కేసులో అరెస్టయి జైలుకెళ్లిన కన్నడ నటుడు దర్శన్‌కు కాస్త ఊరట లభించింది. ఈ కేసులో ఆయనకు మధ్యంతర బెయిర్ మంజూరైంది. వైద్య చికిత్స కోసం ఆరు వారాల పాటు బెయిల్ మంజూరు చేస్తూ కర్ణాటక హైకోర్టు బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. అనారోగ్య కారణాల రీత్యా తనకు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ దర్శన్ తొలుత సెషన్స్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వెన్నునొప్పి, మూత్రపిండాల సంబంధిత అనారోగ్యం, కాళ్లలో నరాల్లో రక్త ప్రసరణ లేక ఇబ్బంది పడుతున్నాడని, సర్జరీ చేసుకునేందుకు బెయిల్ ఇవ్వాలని కోరారు. ఈ పిటిషన్‌ను సెషన్స్ కోర్టు తిరస్కరించడంతో హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై ఇటీవల విచారణ జరిపిన న్యాయస్థానం తీర్పును రిజర్వ్ చేసింది. తాజాగా ఆరు వారాల పాటు మధ్యంతర బెయిల్ కల్పించింది. కర్ణాటకలో దర్శన్ అభిమాని రేణుకాస్వామి హత్య కేసు ఇటీవల సంచలనంగా మారిన విషయం తెలిసిందే. అతడిని చిత్రహింసలకు గురి చేసి హత్య చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఈ కేసులో దర్శన్, ఆయన స్నేహితురాలు పవిత్రగౌడ సహా 15 మందిని అరెస్టు చేశారు. నిందితులు రేణుకాస్వామిని అత్యంత పాశవికంగా కొట్టినట్లు తేలింది. అతడికి కరెంట్‌షాకులు కూడా పెట్టినట్లు పోస్టుమార్టం నివేదిక పేర్కొంది. పరప్పన అగ్రహార కేంద్ర కారాగారంలో విచారణ ఖైదీగా ఉన్న దర్శన్‌ను.. బెంగళూరు న్యాయస్థానం ఆదేశాల మేరకు ఇటీవల బళ్లారి జైలుకు తరలించారు.

## 2 కోట్లు ఇవ్వకుంటే.. సల్మాన్ ఖాన్‌ను చంపేస్తాం



బాలీవుడ్ హీరో సల్మాన్ ఖాన్‌కు మళ్లీ బెదిరింపు కాల్స్ వచ్చాయి. రెండు కోట్లు ఇవ్వాలని, లేదంటే చంపేస్తామని ఆయన్ను బెదిరించారు. గుర్తు తెలియని వ్యక్తి నుంచి ఆ మెసేజ్ వచ్చింది. ముంబై ట్రాఫిక్ పోలీసులకు ఆ మెసేజ్ వచ్చినట్లు తెలుస్తోంది. ఒకవేళ డబ్బులు చెల్లించకుంటే, అతన్ని చంపేస్తామని ఆ మెసేజ్‌లో వార్నింగ్ ఇచ్చారు. ముంబైలోని వొర్లీ పోలీసులు.. గుర్తు తెలియని వ్యక్తిపై కేసు బుక్ చేసి విచారణ చేపట్టారు. సల్మాన్‌ను బెదిరించిన కేసులో మంగళవారం 20 ఏళ్ల వ్యక్తిని ముంబై పోలీసులు అరెస్టు చేశారు. బాబా సిద్దిక్ కుమారుడు జీషాన్ సిద్దిక్‌తో పాటు సల్మాన్‌ను ఓ వ్యక్తి బెదిరించాడు. నిందితుడిని మొహమ్మద్ తయ్యాబ్‌గా గుర్తించారు. అతన్ని గుర్ఫాన్ ఖాన్ అని కూడా పిలుస్తారు. నోయిడా సెక్టార్ 39లో అతను ఉంటున్నాడు. అక్టోబర్ 12వ తేదీన బాబా సిద్ధిక్‌ను హత్య చేసిన విషయం తెలిసిందే.



## మాళవిక మోహనన్ హాట్ సెల్ఫీ

అతి తక్కువ సమయంలోనే సౌత్ ఇండస్ట్రీలో పాపులర్ అయిన హీరోయిన్ మాళవిక మోహనన్. 2013లో బట్టం బోలే సినిమాతో మలయాళీ సినీరంగంలోకి అడుగుపెట్టింది. ఆ తర్వాత కార్తీక్ సుబ్బరాజు దర్శకత్వంలో రజినీకాంత్ హీరోగా నటించిన పెట్టా చిత్రంలో కనిపించింది. ఈ మూవీతో తమిళం ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ ముద్దుగుమ్మ.. ఆ తర్వాత కోలీవుడ్ ఇండస్ట్రీలో వరుస ఆఫర్స్ అందుకుంది. ధనుష్, విజయ్ దళపతి వంటి స్టార్ హీరోలతో కలిసి నటించిన మాళవిక.. ఇప్పుడు తెలుగులోకి ఎంట్రీ ఇవ్వనుంది. ప్రస్తుతం యంగ్ రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా నటిస్తున్న రాజాసాబ్ చిత్రంలో నటిస్తుంది. కొద్ది రోజులుగా ఈ మూవీ షూటింగ్ జరుగుతుంది. ఈ చిత్రం తర్వాత మాళవిక టాలీవుడ్ ఇండస్ట్రీలో రాణిస్తుందేమో చూడాలి. ఇదిలా ఉంటే తాజాగా ఇండస్ట్రీలలో హీరోయిన్స్ పట్ల వచ్చే ట్రోల్స్, విమర్శలపై ఆసక్తికర కామెంట్స్ చేసింది.మాళవిక చివరిసారిగా తంగలాన్ చిత్రంలో నటించింది. చియాన్ విక్రమ్ నటించిన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్ అయ్యింది. అలాగే సిద్ధాంత్ చతుర్వేది సరసన హిందీ యాక్షన్ చిత్రం 'యుద్ర'లో కూడా నటించింది. మాళవిక రాబోయే ప్రాజెక్ట్‌లలో తమిళ స్పై థ్రిల్లర్ 'సర్దార్ 2', రొమాంటిక్ కామెడీ హారర్ చిత్రం 'ది రాజా సాబ్' ఉన్నాయి.



## ప్రభుత్వ ఆసుపత్రిలో మందుల కొరత

### ప్రభుత్వ ఆసుపత్రులకు వెళ్లాలంటే భయపడుతున్న జనం

నర్సంపేటలో ఏర్పాటైన జిల్లా ఆసుపత్రిలో మందుల కొరతతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.. సాధారణ మందులు కూడా లేవంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఐవీ సెట్లు కూడా బయట కొనాల్సిన పరిస్థితి ఉంది. రాన్ ట్యాక్, పాన్ టాప్, జోఫార్, డైక్లి, డైసైక్లోమిన్, పాం, ఎవిల్ వంటి ఇంజెక్షన్లు, మాత్రలు.. పాము, విషపు పురుగుల కాటుకు గురైతే ఇచ్చే పాం ఇంజెక్షన్లు కూడా లేవు. కడుపు నెప్పి, వాంతులు, ఒంటి నొప్పుల నివారణ మాత్రల్లేవు.. సాధారణ మందులు కూడా లేకపోవడంతో, అర్ధరాత్రి పూట వైద్యానికి వెళ్ళే రోగులు బయట మందుల షాపులు మూసి ఉండడంతో అవస్థలు పడుతున్నారు. చెన్నారావు పేటకు చెందిన ఓ వివాహిత పురుగుల మందు తాగి ఆస్పత్రిలో చేరితే, ఆమెకు ఉప్పు నీరు తాపించి వాంతి చేయించారు. మందుల కొరతపై స్పందించిన ఆస్పత్రి ఆర్ఎంఓ..

అవును మందుల కొరత నిజమే, దీనిపై అధికారులకు తెలిపాం. వాళ్లు పట్టించుకోవడం లేదంటూ సమాధానం ఇచ్చాడు.

## "క" మీద ఒక్కసారిగా పెరిగిన పాజిటివిటీ

యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న అవైటెడ్ సినిమా "క" కూడా ఒకటి. మరి మొత్తం ఇద్దరు దర్శకులు పని చేసిన ఈ సినిమా టీజర్ నుంచే మంచి బజ్ ని సంతరించుకుంది. ఇలా అక్కడ నుంచే గ్యాప్ తీసుకున్నా ఈసారి కిరణ్ అబ్బవరం మంచి ప్రయత్నంతో వస్తున్నాడు అనే టాక్ లో ఉంది. అయితే రీసెంట్ ట్రైలర్ తో మరింత హైప్ కూడా నెలకొంది కానీ ప్రీ రిలీజ్ ఈవెంట్ లో మాత్రం కిరణ్ అబ్బవరం స్పీచ్ చూసి చాలా మంది షాకయ్యారు. తనపై ట్రోల్స్ కోసం స్పందించిన కిరణ్ ఈ ట్రోల్స్ విషయాన్ని తనపై పాజిటివ్ గా మార్చుకున్నాడని చెప్పొచ్చు. దీనితో సోషల్ మీడియాలో చాలా మంది డెఫినెట్ గా "క" సినిమా చూస్తాం అని చెబుతున్నారు. కిరణ్ అబ్బవరం చాలా పరిపక్వతతో, క్లారిటీగా మాట్లాడుతున్నాడు అని క సినిమా కూడా వర్కవుట్ అయ్యేలానే అనిపిస్తుంది అని చాలా మంది అనుకుంటున్నారు. మరి వీటితో అయితే తన సినిమాపై ఇపుడు పాజిటివ్ ఏర్పడింది. మరి ఈ సినిమా అనుకున్న అంచనాలు రీచ్ అవుతుందా లేదా అనేది వేచి చూడాలి.

